సమాచారం

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 9, వంకాయ 18, బెండ 28, పచ్చి మిర్చి 40, కాకర 38, బీర 45, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండ 13–23, చిక్కుడు 45, గోకర 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 40, ఆలు 20, దోస 18, సొర 9, పొట్ల 13, ఉల్లి 12 చామగడ్డ 35. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం సముదాయంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ద్వాదశ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం 7 గంటలకు గోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 330వ ఆరాధన సందర్భంగా ప్రత్యేక పూజలు, సామూహిక సహపంక్తి భోజనాలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

కొత్త పైప్‌లైన్‌తో లోప్రెషర్ సమస్యకు చెక్



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుతో లోప్రెషర్ సమస్య బస్తీవాసులకు దూరమవుతుందని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహననగర్ అంబేడ్కర్ బస్తీ, బాలదానమ్మబస్తీలో కొత్తగా చేపట్టనున్న వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బస్తీలలో మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ చంద్రునాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, బస్తీవాసులు సోమయ్య, లక్ష్మణ్, గణేష్, బాలు, సందీప్, పరశురామ్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఆటోనగర్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న లారీ సప్లయర్స్ అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జువ్వాజి శ్రీనివాసరావు, కోశాధికారి కిష్టాపురం శంకర్, ఉపాధ్యక్షుడు ఉప్పు వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా ఇదే పరిస్థితి

- రోడ్డుపై పారుతున్న మురుగు
- ఫిర్యాదు చేసినాపట్టించుకోని అధికారులు
- వికాస్‌నగర్ కాలనీవాసుల ఇక్కట్లు

చైతన్యపురి: డ్రైనేజీ నీరు రహదారిపై ఏరులా పారుతుండంతో రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చైతన్యపురి డివిజన్ వికాస్‌నగర్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాక రోడ్ల కటింగ్‌ల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. నూతన డ్రైనేజీ లైన్ వేసిన సమయంలో కొంత మంది తమ ఇంటి కనెక్షన్‌ను పాతలైన్ నుంచి కొత్తలైన్‌కు మార్చుకోకపోవడంతో పాతలైన్ డమ్మీ అయి మురుగు రహదారులపై పొంగి పొర్లుతోందని కాలనీవాసులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వికాస్‌నగర్ కాలనీ రహదారిపై డ్రైనేజీ నీరు

రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది



దాదాపు రెండు నెలలుగా డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. రహదారి మధ్యలో గుంత ఉండటంతో అక్కడే నీరు నిలిచి యేటిని తలపిస్తోంది. వర్షం వస్తే మోకాళ్ల లోతు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేస్తే వచ్చి చూసి వెళ్లారు కానీ.. సమస్యను పరిష్కరించలేదు. కార్పొరేటర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

–ఎ.అరుణ, వికాస్‌నగర్ కాలనీవాసి

రహదారిని బాగు చేయాలి



నూతన డ్రైనేజీ పైప్‌లైన్ కనెక్షన్లు ఇచ్చినప్పుడు రోడ్డు కటింగ్‌లు చేసి అలాగే వదిలేశారు. ప్యాచ్‌వర్క్ చేయకపోవటం వల్ల రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డు ఎత్తు పల్లాలు ఉండటం వల్ల రోడ్డు మధ్యలో నీరు నిలిచి మూడు,నాలుగు రోజులు అలాగే ఉంటోంది. వర్షం వస్తే వరదనీరు నిలిచి ఉండి పరిస్థితి మరింత ఘోరంగా మారుతోంది. నూతన రోడ్డు వేస్తే బాగుంటుంది.

–జి.వందన, వికాస్‌నగర్ కాలనీవాసి

త్వరలో సమస్యను పరిష్కరిస్తాం



వికాస్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య ఉన్నట్లు కాలనీవాసులు నా దృష్టికి తీసుకొచ్చారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తా. ఇంకా పాత డ్రైనేజీ కొనసాగిస్తున్న ఇళ్ల వారికి కొత్త డ్రైనేజీ లైన్‌కు కనెక్ట్ చేసుకోవాలని సూచించాం. డ్రైనేజీ లైన్ కనెక్షన్లు పూర్తయితే నూతన సీసీ రోడ్డు వేసేందుకు యత్నిస్తాం. రోడ్డు నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తాం.

– రంగా నర్సింహగుప్తా, కార్పొరేటర్ , చైతన్యపురి డివిజన్

ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచండి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: నియోజకవర్గంలోని పలు కాలనీల్లో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచాలని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు అధికారులతో ఎస్‌ఎన్‌డీపీ పనుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సరూర్‌నగర్ చెరువు కట్ట నుంచి చైతన్యపురి నాలా వరకు, శివగంగా థియేటర్ నుంచి పీ అండ్ టీ కాలనీ వరకు నిర్మిస్తున్న బాక్స్ డ్రైయిన్ కెపాసిటీని పెంచి రీమోడలింగ్ చేయాలని సూచించారు. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయని, మొత్తం పనులు పూర్తయితే ముంపు సమస్య నుంచి కాలనీలకు పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని అన్నారు. సమావేశంలో ఈఈ కృష్ణయ్య, డీఈ కిరణ్, కన్సల్టెన్సీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ట్రాన్స్‌జెండర్స్ వేషంలో నేరాలు

- మహిళ పర్స్ లాక్కొని పరారైన ముగ్గురు వ్యక్తుల అరెస్టు
- నిందితులు కారు డ్రైవర్లుగా గుర్తింపు

చైతన్యపురి: కారులో కూర్చుని ఉన్న మహిళ నుంచి పర్స్ లాక్కొని పరారైన ముగ్గురు నకిలీ ట్రాన్స్‌జెండర్స్‌ను సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎల్. రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..బాలాపూర్ సాయినగర్ కాలనీకి చెందిన నవిత మాథీవ్స్ బుధవారం కొత్తపేట డాక్టర్స్ కాలనీలోని బేకరీకి కారులో వచ్చారు. ఆమె బేకరీలోకి వెళ్లగా కారులో ఆమె తల్లి ప్రేమలత, పిల్లలు ఉన్నారు. అదే సమయంలో కారు వద్దకు చీర కట్టుకుని వచ్చిన ముగ్గురు నకిలీ ట్రాన్స్‌జెండర్స్ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రేమలత రూ.10 ఇవ్వగా రూ.500 ఇవ్వాలని చప్పట్లు కొడుతూ ఆమెను ఇబ్బంది పెట్టారు. పర్స్‌లోని డబ్బులు తీస్తుండగా వారు ఆమె చేతిలోని పర్స్ లాక్కొని పరారయ్యారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లెలగూడకు చెందిన కళ్లెం బాలకృష్ణ (41), చదువుల సమ్మయ్య (54), పొస్తం ఆంజనేయులు (35)లను నిందితులగా గుర్తించారు.ముగ్గురూ కారు డ్రైవర్లని, సులువుగా డబ్బు సంపాదించేందుకు ట్రాన్స్‌జెండర్స్ వేషం వేసుకుని ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని డీఐ తెలిపారు. నిందితుల నుంచి పర్సు, అందులోని రూ. 8 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించామన్నారు.



నిందితులు

రూ. 7 కోట్లతో దివ్యాంగులకు ఉపకరణాలు

- వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి



చాదర్‌ఘాట్: వికలాంగుల సహకార సంస్థ నిధుల నుంచి రూ. 7 కోట్లతో దివ్యాంగులకు ఉచితంగా పంపిణీ చేసే నిమిత్తం వివిధ ఉపకరణాలు కొనుగోలు చేశామని సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి తెలిపారు. శుక్రవారం మలక్‌పేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... మే5 లోపు దివ్యాంగులు జిల్లాల్లోని డీడబ్ల్యూఓ కార్యాలయం వద్ద లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోటరైజ్ వాహనాలు డిగ్రీ పాసైన వారికి, ఇంటర్‌లోపు పాసైన వారు ఇతర ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.

కృష్ణానగర్ కాలనీ సమస్యలు తెలుసుకున్న అధికారులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ కృష్ణానగర్ కాలనీలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులు 'పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో మంజూరైన సీసీరోడ్డును వెంటనే వేయాలని, సాయి ఫంక్షన్‌హాల్ దగ్గర డ్రైనేజీ లైన్‌తో ఇబ్బందులు పడుతున్నందున లైన్ మార్చాలని కోరారు. అలాగే, బీటీరోడ్లకు ప్యాచ్ వర్క్స్ చేయాలని, రోజువారీగా శానిటేషన్ పనులు చేపట్టాలని, విద్యుత్ పోల్స్, లైట్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డీజీఎం సరితను కోరారు. జీహెచ్‌ఎంసీ అధికారులు పూజ, శివ, సురేష్, సతీష్, శంకర్, శ్రీను, బీఆర్‌ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, ప్రత్యూష్,శివకుమార్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం.. 25 గుడిసెలు దగ్ధం

పహాడీషరీఫ్: పూరిగుడిసెలు అగ్నికి ఆహుతైన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్ప ఆలయం వెనక ఛత్రీస్ఫుడ్‌కు చెందిన కార్మికులు గూడారాలు వేసుకొని ఉంటున్నారు. శుక్రవారం ఉదయం రొట్టెలు చేసుకున్న కార్మికులు మంటలార్పకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. క్రమేణా మంటలు అన్ని గుడిసెలకు వ్యాపించాయి. దాదాపు 25 గుడిసెల్లోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. ఫైరింజన్ వచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య కథనం ప్రకారం.. విద్యానగర్ –కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (35) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన నలుపు రంగు చొక్కా, నీలిరంగు ఫ్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పైకి..మ్యాన్‌హోళ్లు కిందికి

- నందిహిల్స్ రహదారిపై ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- రహదారిని అభివృద్ధి చేసి మ్యాన్‌హోళ్ల ఎత్తును పెంచని కాంట్రాక్టర్
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

మీర్‌పేట: రహదారిని అభివృద్ధి చేశారు.. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను వదిలేశారు.. దీంతో ఆ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్ చౌరస్తా నుంచి విజ్ఞానపురి కాలనీ వరకు బీఎన్‌రెడ్డి నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని ఇటీవల బీటీరోడ్డుగా అభివృద్ధి చేశారు. రోడ్డును అభివృద్ధి చేసినంతవరకు బాగే ఉన్నప్పటికీ.. రహదారిపై ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. మ్యాన్‌హోళ్లు కిందకు.. రోడ్డు పైకి ఉండటంతో అవి కనిపించక వాహనాలు గుంతలో దిగబడి నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు వేసే సమయంలో కాంట్రాక్టర్ మ్యాన్‌హోళ్లను అలాగే వదిలేయడం.. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయని స్థానికులు తెలిపారు.

తరచూ ప్రమాదాలు..

ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాల రాపోకలు ఉంటాయి. దగ్గరికి వచ్చే వరకు కూడా మ్యాన్‌హోళ్ల గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రాత్రివేళల్లో అయితే కార్లు, ద్విచక్ర వాహనాలు మ్యాన్‌హోల్ గుంతల్లో ఇరుక్కుని పలువురు గాయాలబారిన పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్ల ఎత్తును పెంచడంతో పాటు మ్యాన్‌హోళ్లకు మూతలు బిగించి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.





నందిహిల్స్ రోడ్డుపై మ్యాన్‌హోల్‌లో దిగబడిన కారు, (ఇన్‌సెట్‌లో) రహదారిపై ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

రోడ్డుకు సమాంతరంగా చేస్తాం

రోడ్డు అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు కొంత లోపలికి వెళ్లడం జరిగింది. మ్యాన్‌హోళ్లను ఆరు ఇంచులు పైకి లేపి రోడ్డుకు సమాంతరంగా చేస్తాం. వారం రోజుల్లో పనులను ప్రారంభించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– గోపీనాథ్, డీఈ, మీర్‌పేట కార్పొరేషన్

అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరాకు చర్యలు

సైదాబాద్: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేటర్ ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్‌లో పర్యటించారు. కాలనీలో పలుచోట్ల శిథిలమైన విద్యుత్ స్తంభాలను వారు గుర్తించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందే అలాంటి స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పలు కరెంట్ స్తంభాలపై పాడైపోయిన బంచ్ కేబుళ్లను మార్చాలని వారిని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ, అశోక్‌గౌడ్, చంద్రయ్య పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో అధికారులతో కలిసి శంకేశ్వర బజార్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలి: సామ



మృతుడు చిరంజీవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న చిరంజీవిని పోలీసులు విచారణ పేరుతో చిత్రహింసలకు గురిచేయడం వల్లే మృతి చెందాడని రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. పోలీసులపై హత్య కేసు నమోదు చేసి మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీకి చెందిన చిరంజీవి(32)ని ఈనెల 25న సెల్‌ఫోన్ దొంగతనం కేసులో విచారణ కోసం నగరంలోని తుకారాంగేట్ పోలీసులు తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేయడంతో మృతి చెందాడని, దీంతో అతడి కుటుంబం రోడ్డున పడిందని అన్నారు. పోలీసులు హత్య చేసిన చిరంజీవి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి చిరంజీవి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గజాల రాజుగౌడ్ ఎరుకల మల్లేశ్‌గౌడ్, మునిల్ నాయక్, కాటం శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూల్ సీజ్

చైతన్యపురి: చైతన్యపురిలో ఎలాంటి అనుమతి లేకుండా విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న ఓ పాఠశాలను సరూర్‌నగర్ మండల అధికారులు సీజ్ చేశారు. హనుమాన్‌నగర్ కాలనీలో ది మాస్టర్ మైండ్స్ స్కూల్ నిర్వాహకుడు ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు పాఠశాల గేట్‌కు తాళం వేసి సీజ్ చేశారు. అనుమతులు లేని పాఠశాలలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చైతన్యపురిలో విద్యాశాఖ అధికారులు సీజ్ చేసిన పాఠశాల

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



వైశాలీనగర్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోని సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. అందుకే డివిజన్‌లోని కాలనీలు, బస్తీవాసులకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం వైశాలీనగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కాలనీవాసుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఛిద్రమైన అంతర్గత రహదారులను ఆధునీకరించాలని, తాగునీటి సరఫరా మెరుగు పర్చాలని, కాలనీలోని రహదారులకు అనుకొని ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులు తెలిపిన సమస్యలను అధికారులతో చర్చించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధకర్‌రెడ్డి, అచ్యుతరెడ్డి, నర్సింహారెడ్డి, భాస్కర్‌రాజు, హనుమంతరావు, పరమేష్‌రెడ్డి, చెన్న కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం: కోట్ల



దీక్షలో ప్రసగిస్తున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామిక చర్య అని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించిన నిరసన దీక్షకు మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాల నుంచి ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. టీపీసీసీ నాయకులతో కలిసి వారు నిరసన దీక్షలో బైఠాయించారు. అనంతరం సైదాబాద్‌లో ఆయన మాట్లాడతూ, గాంధీ కుటుంబం దేశ సేవ కోసం ఎన్నో త్యాగాలకు పాల్పడిందన్నారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు చేసిన బలిదానాలను ఈ దేశప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీజేపీ దేశంలో మత చిచ్చు పెట్టి అధికారాన్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సెక్టార్‌లకు దోచి పెడుతోందని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నంబర్‌ప్లేట్లు లేని వాహనాలు సీజ్ చేస్తాం: సీఐ

హస్తినాపురం: ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలకు విధిగా నంబర్‌ప్లేట్లు రాయించుకోవాలని, నంబర్ ప్లేట్లు లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ డి.జలేందర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాతూ, కొంతమంది నంబర్‌ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలతో నేరాలకు పాల్పడుతున్నారని, వారిని గుర్తించేందుకు పోలీసు స్టేషన్ పరిధిలో అడుగడుగునా పోలీస్ చెకింగ్‌లు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రజలందరూ పోలీసులకు సహకారం అందించి , తమ వాహనాలకు నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెకింగ్‌లో వాహనాలు నంబర్లు లేకుండా పట్టుబడితే వాటిని సీజ్‌చేసి కోర్టులో ప్రవేశపెడతామన్నారు. వాహనదారులు వాహన పత్రాలను చూపించి కోర్టు ద్వారా వాహనాలను రిలీజ్ చేసుకోవాలన్నారు. నేరాలను అరికట్టడంలో భాగంగా వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని , ఇటీవల వాహనాల తనిఖీలు చేయడంతో చోరీకి గురైన కొన్ని ద్విచక్రవాహనాలు పట్టుబడ్డాయని, అందుకు అందరూ సహకరించాలని సీఐ జలేందర్‌రెడ్డి కోరారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న వనస్థలిపురం పోలీసులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9505507616 9912220363 9912220365